

కథా కౌముది

# పురస్కారం

సింహప్రసాద్

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

"నాన్నా"

"చెప్పు కన్నా"

"మీరేమీ అనుకోనంటే..."

"ఏదైనా ఎందుకనుకుంటాన్రా. పాలు తాగే వయస్సులో నువ్వు నా గుండెల మీదెక్కి తొక్కినప్పుడు మురిసిపోయాను తప్ప ఏమీ అనుకోలేదే. పండుగనాడు నా కొత్తబట్టల మీద ఒంటేలుకు పోయినప్పుడు కొంచెం కూడా కోప్పడలేదు కదరా. ఆఫీసు కెళ్తున్నప్పుడు నాతో బాటు వస్తానని మారాం చేస్తే సెలవు పెట్టి మరీ నిన్ను పార్కుకి తీసుకెళ్ళాను. గుర్తుందా? హైస్కూల్లో ఉండగా నాకు చెప్పకుండా మిత్రుడి సైకిల్ తీసుకుని తొక్కడం నేర్చుకుంటూ, మోకాళ్ళూ మోచిప్పలూ పగలు గొట్టుకునొస్తే మందు రాశాను తప్ప మందలించలేదు. అప్పుడు అనుకోనిది ఇప్పుడు అనుకుంటానా చెప్పు..?"

"నాకు తెలుసు నాన్నా. నేనంటే మీకూ, అమ్మకు ప్రాణం - కాదు పంచప్రాణాలు"

"నువ్వు నిజంగా మా ప్రాణానివేరా. మాలోంచి ప్రాణశక్తి తీసుకుని ఊపిరిపోసుకున్నవాడివే. మావేగాక తాత ముత్తాతల లక్షణాలూ పోలికలూ పుణికి పుచ్చుకున్న మా వంశాంకురానివి"

"మీ కోసం ఫలానాది కావాలని మీరెప్పుడైనా కోరుకున్నారా నాన్నా?"

"నా కోసమా! వూహూ. నేనెప్పుడూ కోరుకోలేదురా. మీ అమ్మకోసం మన కుటుంబం కోసం కోరుకున్నాను. నీ కోసమూ రెండు సార్లు కోరుకున్నారా"

"రెండు సార్లేనా"

"వూఁ. నువ్వు మీ అమ్మ కడుపులో ఉన్నప్పుడు నీ ఆరోగ్యం నీ ఎదుగుదల అన్నీ సక్రమంగా ఉండాలని ఎందరో దేవుళ్ళకి మొక్కింది మీ అమ్మ. గర్భిణుల మీద గ్రహణ ప్రభావం ఉండదని తెలిసినా నీకోసం ఎలాంటి రిస్కూ తీసుకోకూడదని గ్రహణకాలంలో ఏమీ తినకుండా త్రాగకుండా మౌనంగా కూర్చుంది. ఇహ నేనేమో నువ్వు క్షేమంగా భూమ్మీదకి రావాలని మొదటిసారిగా కోరుకున్నాను. నీ

బుడిబుడి నడకలకి పొంగిపోయి నీ నడకా నడతా ఎప్పటికీ సవ్యంగా నవ్యంగా ఉండాలని కోరుకున్నాను. ఆ రెండు సార్లేరా నీ గురించి ప్రత్యేకంగా నేను కోరుకున్నది"

"ఇప్పుడు నేను పెద్దవాడ్నయ్యాను. మీకన్నా పొడుగయ్యాను. మీ కన్నా ఎక్కువ సంపాదిస్తున్నాను. మీరు నర్సాపురంలో ఉంటే నేను న్యూయార్క్‌లో ఉన్నాను"

"అన్నిటా నన్ను మించి పోయినందుకు చాలా సంతోషంగా వుందిరా. ఆనందాల్లోనూ అనుబంధాల్లోనూ నన్ను దాటిపోవాలి. అదే నా తపన, కోరిక, ఆశ"

"మీరే నాకు ఆదర్శం. మీ అడుగు జాడల్లో నడవాలన్నదే నా కోరిక.."

"నా అడుగుల్లో అడుగు వేస్తే నే వెళ్ళిన చోటుకే నువ్వూ వెళ్తావు. వూహూ. నువ్వింకా ఎంతో ఎంతో దూరం ప్రయాణించాలి. కొత్తదార్లు తొక్కాలి. ఎన్నో ఎత్తులకెదగాలి. ఎందరెందరికో ఆదర్శప్రాయుడివి కావాలి. నిన్ను చూసి నీ గురించి విని నీ స్ఫూర్తితో మరెందరో జీవితంలో ఎంతో ఉన్నత స్థితికి చేరుకోవాలి"

"మీరు నా ప్రక్కన ఉండాలి గాని ఏమైనా సాధిస్తాను."

"ఇంతదాకా ఉన్నాం కదరా చిన్నా. మీ అమ్మకు పురుటి నొప్పులొస్తున్నప్పుడు, ధైర్యం చెబుతూ అమ్మకడుపులో వున్న పక్కనే లేబర్ రూంలో ఉన్నాను. అమ్మని డెలివరీ రూంలోకి తీసుకెళ్ళినప్పుడు ఆ ప్రక్క గదిలోనే ఆందోళనతో ఎదురుచూస్తూ వున్నాను. నువ్వు పాలు తాగుతున్నప్పుడు, ఆడుకుంటున్నప్పుడు, అల్లరి చేస్తున్నప్పుడు హోం వర్కు చేస్తున్నప్పుడు, బడికెళ్తున్నప్పుడు, పరీక్షలకు తయారవుతున్నప్పుడు, నీ ప్రతి అడుగులోనూ నీ ప్రక్కనే నీ వెంటే నీ వెన్నంటే ఉన్నాను. నువ్వు బ్యాలన్స్ తప్పి ఎక్కడ పడిపోతావోనని నీ దారి పొడవునా నా రెండు చేతులూ అడ్డుపెట్టి కాపుగాచాను. నీ దారి పొడవునా దివిటీలు పట్టి నిలిచాను"

"నాకు తెలుసు నాన్నా. అందుకే మీకేమైనా గొప్ప బహుమతి ఇవ్వాలని ఉంది. ఇంతవరకు ఏ కొడుకూ ఏ తల్లిదండ్రులకీ ఇవ్వనంత గొప్పది ఇవ్వాలని ఉంది. ఒక రకంగా మీ మాతృ పితృ ప్రేమల్ని పురస్కరించాలని ఉంది. మీకు గానీ అమ్మకు గానీ తీరని కోరిక, తీరితే బాగుండుననుకున్న కోరిక ఏదైనా ఉంటే చెప్పండి నాన్నా.. తీర్చేస్తాను"

"పిచ్చి నాన్నా. నీ మాటలకే మా కడుపు నిండి పోయిందిరా. పరమాన్నం తిన్నట్టుగా ఉంది. మాకింకేం కావాలి చెప్పు?"

"అలా అనొద్దు. మీక్కావల్సింది ఏదైనా సరే ఎంత ఖరీదైనా సరే కొంటాను. నా రెక్కలకింత శక్తి రావడానిక్కారణం మీరే నాన్నా. నా జన్మంతా ఊడిగం చేసినా మీ ఋణం తీరదు.."

"అది గుర్తున్నందుకు చాలా సంతోషంగా ఉందిరా చిన్నా"

"మీరు చల్లగా నిద్రపోవడానికి ఏసీ పెట్టిస్తాను. కరెంటు కష్టాలు తెలీకుండా ఇన్వర్టర్ కొంటాను. హాయిగా బయట తిరగటానికి కారు కొనిస్తాను. ఇంకా పెద్ద ఇల్లుగానీ డూప్లెక్స్ గానీ కొననా? చెప్పు నాన్నా ఇప్పుడే కొనేస్తాను."

"ఎంత పెద్ద ఇల్లు అయినా ఉండేది మేం ఇద్దరమే కదురా. మాకీ గూడుచాలు గాని, కొనకుండా ఇవ్వగలిగిందేదైనా ఇవ్వరా చిన్నా"

"డబ్బు పెట్టి కొనకుండా ఊరికే ఏమీరాదు కదా నాన్నా"

"ఈ ప్రపంచంలో తల్లి పాలు తప్ప ఏవీ ఉచితంగా లభించవని నాకూ తెలుసురా. కానీ మాకు ఆర్థిక బహుమానం గాక హార్దిక బహుమానం కావాలి"

"నాకేం అర్థం కావట్లేదు. కొంచెం వివరంగా వివరించు నాన్నా, ఇచ్చేస్తాను"

"నువ్వీ ప్రపంచంలోకి రాబోతున్నావని తెలిసి మేమంతగా పొంగిపోయామో చెప్పలేను. నీ రాకకోసం ఎంతగా ఎదురు చూశామో, నీకు స్వాగతం చెప్పాలని ఎంతగా ఉవ్విళ్ళూరామో, నీకోసం ఎన్ని ఏర్పాట్లు చేశామో మాటల్లో చెప్పలేను. నువ్వు వస్తూ మమ్మల్నెంత మధురానుభూతికీ, పరమానందానికీ లోను చేశావో అదీ చెప్పలేను. అప్పుడు మా మనస్సులెంత ఉద్విగ్నోత్సాహాలతో ఉప్పొంగిపోయాయో, మా మోములెంతగా వికసించాయో, మా శరీరాల్లోని అణువణువూ ఎంతెలా పులకరించి పోయాయో వర్ణించలేను."

"అవునవును. నా చిన్నప్పుడు అమ్మ చెప్పింది. పురుటి కష్టాన్నంతా నా మోము చూస్తూనే మరచిపోయిందిట. పురుటి నొప్పులు తాళలేక చచ్చిపోతే బావుణ్ణనుకున్న అమ్మ నన్ను చూశాక నాకోసం వెయ్యేళ్ళు బ్రతకాలనుకుందిట"

"అవునవును. సరే, కోరుకోమంటున్నావు గనుక మనస్సులోని మాట చెబుతున్నాను. నీ నుంచి మేం ఆశించేదీ అలాంటి ప్రతిస్పందనేరా"

"ఏవిటేవిటీ? మీకేం కావాలీ? త్వరగా మనస్సులోని ఊసు బయటపెట్టండి నాన్నా"

"మేం ఈ లోకాన్ని వదిలి వెళ్ళేటప్పుడు నువ్వు మా ప్రక్కనే ఉండాలి. మమ్మల్ని సాదరంగా సాగనంపాలి. నిన్నూ నీ ప్రేమమూర్తినీ చూసి నిన్ను కన్న మా జన్మ ధన్యమైందన్న భావనతో తృప్త మనస్సుతో మేం ఈ ప్రపంచపు రంగస్థలం మీంచి నిష్క్రమించాలి. అదేరా బిడ్డలు తల్లిదండ్రులకిచ్చే అత్యున్నత అత్యంత విలువైన బహుమతి పురస్కారం."

**Click here to share your comments on this story**